వైద్యుల సూచన మేరకే యాంటీబయాటిక్స్ వాడాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిణి బేబీరాణి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ బేబీరాణి

ఒంగోలు సిటీ: వైద్యుల సూచన మేరకే పశువులకు తగిన యాంటీబయాటిక్స్ ఉపయోగించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిణి కె.బేబీరాణి పశుపోషకులకు సూచించారు. విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ వాడకం వలన వచ్చే యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)పై శనివారం స్థానిక త్రోవగుంటలో ప్రాంతీయ పశువైద్య సిబ్బంది, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తగిన యాంటీబయాటిక్, యాంటీ ఫంగల్ వాడకం ప్రాముఖ్యత, వ్యక్తులు, జంతువులు, మొక్కలు, వాటి భాగస్వామ్య పర్యావరణానికి ముప్పు, యాంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్ ప్రాముఖ్యతను వివరించారు. త్రోవగుంట సహాయ సంచాలకులు బి.బసవ శంకర రావు, త్రోవగుంట వైద్యాధికారి డాక్టరు సమీర్‌శర్మ, ఒంగోలు, కొత్తపట్నం మండలాల పశువైద్యాధికారులు, పారా సిబ్బంది, పశువైద్య సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఈఆర్వో వరకుమార్, తహసీల్దార్ సుజన్‌కుమార్

మద్దిపాడు: మండలంలోని పెద్దకొత్తపల్లి, లింగంగుంట గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను డిప్యూటీ కలెక్టర్, ఈఆర్వో వరకుమార్ శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. ఓట్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, ఓట్ల బదిలీ, తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల తహసీల్దార్ సుజన్ కుమార్, బీఎల్‌వోలు ఉన్నారు.

సర్వే వివరాలు త్వరగా నమోదు చేయాలి



ఎంపీడీవో, ఈవోపీఆర్డీలతో మాట్లాడుతున్న డీపీఓ

మద్దిపాడు: మండలంలోని అన్ని పంచాయతీల్లో హౌస్ హోల్డ్ సర్వే వివరాలను త్వరగా స్వర్ణ పంచాయతీ యాప్లో నమోదు చేయాలని డీపీఓ గొట్టిపాటి వెంకట నాయుడు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. నెలాఖరులోగా వివరాలు నమోదు చేయించాలని ఎంపీడీవో బి.జ్యోతి, ఈవోపీఆర్డీ రఘుబాబును ఆదేశించారు. ముందుగా మండలంలోని ఏడుగుండ్లపాడు, గుండ్లాపల్లి, సీతారాంపురం పంచాయతీలను సందర్శించారు.

నాలుగు రోజులు నీటి సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని భాగ్యనగర్ నాలుగో లైన్‌లో మంచినీటి పైపులైనుకు మరమ్మతుల కారణంగా నాలుగురోజుల పాటు పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. భాగ్యనగర్ 4వ లైన్‌లోని పాత మంచినీటి పైపులైన్‌కు-కొత్తగా వేసిన పైపులైన్లకు ఇంటర్ కనెక్షన్ చేస్తున్నట్లు తెలిపారు. అందుకుగానూ ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు, విజయనగర్‌కాలనీ, దారావారితోట, రామ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, అన్నవరప్పాడు, సంతపేట, పోతురాజుపాలెం, కబాడీపాలెం, మిరియాలపాలెం, చిపుకులవారివీధి, కొప్పోలు, బృంధావన్‌నగర్, డ్రీమ్స్ స్కూలు రోడ్డు, ఇందిరమ్మ కాలనీ, పులివెంకటరెడ్డికాలనీ, రాజీవ్‌గృహకల్ప, గుర్రం జాషువా కాలనీ, గోపాల్‌నగర్ ఎక్స్‌టెన్షన్, బలరాం కాలనీ, కేశవరాజుకుంట, చినమల్లేశ్వరకాలనీ, కరుణకాలనీ, కబేళా రోడ్డు, గద్దలగుంట, రాజీవ్ నగర్, సుందర్‌నగర్, మామిడిపాలెం, గాంధీనగర్, కొత్తడొంక, జెడ్పీకాలనీ, మిలటరీకాలనీ, శివాజీకాలనీ, ఎన్‌జీఓ కాలనీ, దిబ్బల రోడ్డు, సత్యనారాయణపురం, ఇందిరా నగర్, వెంకటేశ్వరకాలనీ, నెహ్రూ నగర్ ఎక్స్‌టెన్షన్, జయ ప్రకాష్‌కాలనీ ప్రజలకు నాలుగు రోజుల పాటు మంచినీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు గమనించి ముందు రోజు వచ్చే నీటిని పొదుపుగా వాడుకుని నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు. ఇతర సమాచారం కోసం ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కే నరసింహారావు (98494 66213)ను సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్తంగా

విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలి

చీమకుర్తి రూరల్: విద్యార్థులు మొదటిగా చదువుపై శ్రద్ధ చూపి ఒక లక్ష్యం ఎంచుకుని ఆవైపుగా పయనించాలని చీమకుర్తి సీఐ సుబ్బారావు సూచించారు. మండలంలోని గోనుగుంట పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవాలని, విద్యతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

జెడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ



ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో చిరంజీవి

మద్దిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈవో చిరంజీవి శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ భవనాలను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయం పరిధిలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కార్యాలయంలో హాజరు పట్టీని తనిఖీ చేశారు. ఫైల్స్ ఎక్కువగా ఉండటంతో బీరువాలపై పెట్టిన ఫైళ్లను తొలగించాలని, వాటిని విడిగా భద్రపరచుకోవాలని సూచించారు. ఇద్దరు హాజరుకాకపోవడాన్ని గమనించి ఎంపీడీవోను వివరణ కోరారు. ఒకరు ట్రెజరీకి వెళ్లారని, మరొకరు ఒంగోలు నుంచి మెటీరియల్ తీసుకురావడానికి వెళ్లారని ఎంపీడీవో వి.జ్యోతి తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



ధర్నా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సంతనూతలపాడు: వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ఈ నెల 26న నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. మహాధర్నా కరపత్రాలను మండలంలోని మాచవరంలో ఆవిష్కరించి కూలీలకు పంపిణీ చేసి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు అన్నవరపు శేషారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు సిటీ: ఆటోనగర్ కార్మికుల కష్టాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అదమ్ షఫీ ఆరోపించారు. శనివారం ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 50 మంది కార్మికులతో ఆటోనగర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ అదమ్ షఫీ మాట్లాడుతూ చీకటి పడితే ఆటోనగర్‌లో రోడ్డు ఎక్కడ ఉందో కూడా అర్థంగాని పరిస్థితి ఉందన్నారు. 30 ఏళ్ల నుంచి ఆటోనగర్‌లో రోడ్లు, డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారు లేరన్నారు. ధర్నాలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నవాబ్ జానీ, కార్యదర్శి సత్యన్, కార్మికులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు

ఒంగోలు టౌన్: వైన్ షాపుల యజమానులు ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో సర్కిల్ పరిధిలోని సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులప్పలపాడు మండలాల మద్యం దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు పాల్గొన్నారు.

నేటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ఒంగోలు సిటీ: యూటీఎఫ్ జిల్లా శాఖ స్వర్ణోత్సవ మహాసభలు ఈ నెల 24, 25 వ తేదీల్లో ఒంగోలు సంతపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పీవీఆర్ బాయ్స్ హైస్కూల్ నుంచి ర్యాలీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా గురుపూజోత్సవం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జెడ్పీ హైస్కూల్లో శనివారం శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీరామ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హైస్కూల్తో పాటు శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ నుంచి 120 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. హెచ్ఎం మన్నెం శ్రీదేవి అధ్యక్షత వహించగా, కందుకూరు డిప్యూటీ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా ఉప విద్యాశాఖాధికారి చంద్రమల్లేశ్వరరావు, డాక్టర్ చాపల వంశీకృష్ణ, శాంతకుమారి, ఎంఈవో 1, 2 తులసీకుమారి, పద్మావతి, శ్రీవాణి విద్యానికేతన్ కరెస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల ప్లానింగ్‌పై శిక్షణ

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆహార ఉత్పత్తుల ప్లానింగ్‌పై అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రకృతి వ్యవసాయం-ఆరోగ్యం పోషణ విభాగంపై శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రంగాయపాలెం గ్రామం ప్రగతి గ్రామ ఐక్య సంఘం, మండల సమైక్య ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఏపీఎం విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ క్యాంపులను పరిశీలించిన తహసీల్దార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ క్యాంపులను ఒంగోలు తహసీల్దారు నేలబొట్ల వాసు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం పరిశీలించారు. శర్మకాలేజీ, డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల, జయరాం థియేటర్ సెంటర్‌లోని మున్సిపల్ పాఠశాల, టంగుటూరి ప్రకాశం పంతులు ప్రైమరీ స్కూల్, కొత్తపేట, గొడుగుపాలెం, రామనగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్, ఏసీపీ సుధాకర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.